ప్లాన్ ఒకలా... నిర్మాణాలు మరోలా!

- ఎస్‌ఏడీలో అడ్డగోలుగా బహుళ అంతస్తులు
- కాసులు కురిపిస్తున్న నోటీసులు
- కూటమి నేతల సెటిల్‌మెంట్లు



విమాన్ నగర్‌లో ఇరుకుదారిలో నిర్మిస్తున్న భవనాలు

విశాఖ విద్య: జీవీఎంసీ 90వ వార్డు విమాన్‌నగర్ కమ్యూనిటీ హాల్‌కు సమీపంలో ఓ బహుళ అంతస్తుల భవనం ప్లాన్‌కు విరుద్ధంగా నిర్మిస్తున్నారు. అయితే దీనిపై నోటీసులు జారీ చేసిన నగర పాలక సంస్థ టౌన్ ప్లానింగ్ అధికారులు తదుపరి చర్యలు తీసుకోవడంలో మాత్రం మీనమేషాలు లెక్కిస్తున్నారు. ప్రభుత్వ స్థలాన్ని సైతం ఆక్రమించి తమ సొంత అవసరాల కోసం ఇష్టానుసారంగా రహదారి నిర్మించారు. ఇదే రీతిన బాజీ జంక్షన్ బీఆర్‌టీఎస్ రోడ్‌కు ఆనుకొని నిర్మిస్తున్న షాపింగ్ కాంప్లెక్స్ కమ్ రెసిడెన్షియల్ భవనం నిబంధనలకు విరుద్ధంగా ఉందని నోటీసులు జారీ చేశారు. ఇలా ఎడా పెడా జారీ చేస్తున్న నోటీసులు జీవీఎంసీ జోన్–8 పరిధిలోని టౌన్ ప్లానింగ్ విభాగ అధికారులు, సిబ్బందికి కాసులు పంట పడిస్తున్నాయనే విమర్శలు ఉన్నాయి. ప్లానులో ఒకలా ఉంటే...క్షేత్రస్థాయిలో చేపడుతున్న నిర్మాణం మరోలా ఉన్నప్పటికీ టౌన్‌ప్లానింగ్ అధికారులు చూసీ చూడనట్లు వ్యవహరించడంలో ఆంతర్యమేంటని స్థానికులు ప్రశ్నిస్తున్నారు. ఈ తతంగంపై నగర పాలక సంస్థ కమిషనర్ దృష్టి సారిస్తే వాస్తవాలు వెలుగులోకి వస్తాయంటున్నారు.

ఎస్‌ఏడీలో స్థిర నివాసంపై ఆసక్తి

ఎస్‌ఏడీ సెంటర్‌కు ఇరువైపులా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు చెందిన కార్యాలయాలు ఉన్నాయి. కేజీ నుంచి పీజీ వరకు విద్యాలయాలు అందుబాటులో ఉన్నాయి. గాజువాక, అటు వైపు పెందుర్తి,ఇటు వైపు మర్రిపాలెం, మరో వైపున ఆర్టీసీ బస్టాండ్ వంటి చోట్ల నుంచి వచ్చే వారంతా ఎస్‌ఏడీ సెంటర్ మీదుగానే ప్రయాణం చేయాలి. వాణిజ్య పరంగానూ రోజు రోజుకూ అభివృద్ధి చెందుతున్న నేపథ్యంలో ఎస్‌ఏడీ సెంటర్ పరిసర కాలనీల్లో స్థిర నివాసం కోసం పలువురు ఆసక్తి చూపుతున్నారు. దీంతో ఈ ప్రాంతంలో రియల్టర్లు బహుళ అంతస్తుల నిర్మాణాలు చేపట్టేందుకు ముందుకొస్తున్నారు.

ప్లానింగ్ సెక్రటరీల బెంబేలు

ఎస్‌ఏడీ ఏరియాలో పనిచేసే టౌన్ ప్లానింగ్ సెక్రటరీ ఒకింత ఒత్తిడి, ఆందోళనతో పనిచేయాల్సి వస్తోంది. ప్లాన్ ఒకలా తీసుకొని, నిర్మాణం మరోలా చేపడుతున్న వారంతా పై స్థాయిలోనే ముందస్తు ఒప్పందాలు చేసుకొని పనులు ప్రారంభిస్తున్నారనే ప్రచారం ఉంది. దీంతో క్షేత్రస్థాయిలో పనిచేస్తున్న టౌన్‌ప్లానింగ్ సెక్రటరీల కళ్ల ముందు అనధికార కట్టడం కనిపిస్తున్నా ఏమీ చేయలేక మిన్నకుండిపోతున్నారు. ఏదైనా ఫిర్యాదుల సమయంలో ఉన్నతాధికారులు రంగంలోకి దిగితే మొత్తం నెపాన్ని మాత్రం దిగువ స్థాయిలో పనిచేస్తున్న ప్లానింగ్ సెక్రటరీపైనే నెట్టేసి వారిని బాధ్యులను చేస్తున్నారు. ఇలాంటి ఒత్తిళ్లను తట్టుకోలేక కొంతమంది ప్లానింగ్ సెక్రటరీలు తరచూ సెలవులో వెళ్లిపోతున్నట్లు తెలుస్తోంది. నగర పాలక సంస్థ కమిషనర్ ఇలాంటి వ్యవహారాలపై దృష్టి సారించి అవినీతి కంపును వదిలించేలా చర్యలు తీసుకోవాలని ఈ ప్రాంత వాసులు కోరుతున్నారు.

కూటమి నేతలకు కప్పం కట్టాల్సిందేనట!

బాజీ జంక్షన్‌లో వాణిజ్య అవసరాల కోసం ప్లానుకు విరుద్ధంగా చేపడుతున్న నిర్మాణంపై హైకోర్టు నుంచి ఇక్కడి టౌన్ ప్లానింగ్ అధికారులకు అక్షింతలు పడ్డాయి. అయితే అక్రమాన్ని సక్రమం చేసేందుకు కూటమి నేతలు రంగంలోకి దిగినట్లు ప్రచారం సాగుతోంది. భవన నిర్మాణ దారుడు అధికార పార్టీకి చెందిన ఓ ప్రజాప్రతినిధికి భారీగానే ముట్టజెప్పడంతో టౌన్ ప్లానింగ్ అధికారులు మౌనం దాల్చినట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి.

ప్లాన్‌లో లేకుంటే తొలగిస్తాం

మా నుంచి తీసుకున్న ప్లాన్ ప్రకారమే నిర్మాణాలు చేపట్టాలి. ప్లాన్ అతిక్రమించినట్లు మా దృష్టికి వస్తే అలాంటి వాటిపై చర్యలు తీసుకుంటున్నాం. బాజీ జంక్షన్‌లో ప్లాన్‌లో లేకుండా నిర్మించిన దాన్ని తొలగించాం. విమాన్ నగర్‌లో భవనాలపై పరిశీలన చేస్తాం.

– రఘునాథరావు, ఏసీపీ, జోన్–8

క్లుప్తంగా

ఎయిర్‌పోర్టు పోలీస్‌స్టేషన్‌లో స్వచ్ఛత కార్యక్రమం



ఎయిర్‌పోర్టు పోలీస్‌స్టేషన్ ఆవరణను శుభ్రం చేస్తున్న సీఐ చక్రధరరావు, సిబ్బంది

గోపాలపట్నం: ఎయిర్‌పోర్టు పోలీస్‌స్టేషన్ ఆవరణలో ఆదివారం స్వచ్ఛత కార్యక్రమం నిర్వహించారు. సీఐ చక్రధరరావు పర్యవేక్షణలో స్టేషన్ సిబ్బందితో ఆవరణలోని పిచ్చి మొక్కలు తొలగించడంతో పాటు పరిసరాలను శుభ్రం చేశారు. అనంతరం మొక్కలు నాటారు. ఈ సందర్భంగా సీఐ చక్రధరరావు మాట్లాడుతూ స్టేషన్‌కు వచ్చే వారికి మంచి వాతావరణం కలిగించేలా ఈ చర్యలు చేపట్టామని తెలిపారు. పూల మొక్కలు, క్రోటన్స్ మొక్కల్ని వేసి సుందరంగా తీర్చి దిద్దుతామని తెలిపారు. కార్యక్రమంలో ఎస్‌ఐలు, సిబ్బంది పాల్గొన్నారు.

ఎర్నిమాంబకు ప్రత్యేక పూజలు



ఎర్నిమాంబ అమ్మవారికి ప్రత్యేక హారతులు ఇస్తున్న అర్చకులు శ్రీకాంత్‌శర్మ

కంచరపాలెం : జ్ఞానాపురం కూడలిలో వెలసిన ఎర్నిమాంబ అమ్మవారి ఆలయం ఆషాఢ శుద్ధ అష్టమి ఆదివారాన్ని పురస్కరించుకుని భక్తులతో కిటకిటలాడింది. ఈవో డీవీఎస్ సురేష్ బాబా ఆధ్వర్యంలో ఆలయ పూజారమ్మ వాసుపల్లి విజయమ్మ అమ్మవారిని ప్రత్యేకంగా అలకంరించారు. ఆలయ అర్చకులు పులఖండం శ్రీకాంత్‌శర్మ ఉదయం నుంచి అమ్మవారికి కుంకుమ పూజలు, విశేషార్చనలు, అభిషేకాలు, ప్రత్యేక పూజలు చేశారు. భక్తులకు ప్రత్యేక ఉచిత దర్శనాలతో పాటు రూ. 10, రూ. 50 ప్రత్యేక కౌంటర్లు ఏర్పాటు చేశారు. ఆలయ సిబ్బంది రామకృష్ణ నేతృత్వంలో స్వచ్ఛంద సంస్థ సభ్యులు భక్తుల సౌకర్యాలను పర్యవేక్షించారు.

గోపాలపట్నం తహసీల్దార్‌గా రమేష్



తహసీల్దార్‌కు అభినందనలు తెలుపుతున్న కార్యాలయ సిబ్బంది

విశాఖ విద్య: గోపాలపట్నం తహసీల్దార్‌గా సీహెచ్‌వీ రమేష్ ఆదివారం బాధ్యతలు స్వీకరించారు. ఎన్నికల బదిలీల్లో భాగంగా విజయనగరం జిల్లాలో పనిచేసిన ఆయన తాజాగా జిల్లాకు వచ్చారు. జిల్లా కలెక్టర్ ఆయన్ను గోపాలపట్నం తహసీల్దార్‌గా నియమించారు. బాధ్యతలు చేపట్టిన రమేష్‌కు కార్యాలయ అధికారులు, సిబ్బంది సాదర స్వాగతం పలికారు. కార్యాలయ సిబ్బందితో కాసేపు ముచ్చటించారు. కాగా సీహెచ్‌వీ రమేష్ గతంలో భీమునిపట్నం తహసీల్దార్‌గా పనిచేశారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ సువర్ణబాయి, సర్వేయర్ జగదీశ్వరరావు, వీఆర్వో సాహితి, జూనియర్ అసిస్టెంట్ రోహిత్ కుమార్, టైపిస్టు వంశీ తదితరులు పాల్గొన్నారు. సచివాలయ రెవెన్యూ సిబ్బంది తహసీల్దార్ రమేష్‌కు అభినందనలు తెలిపారు.

అప్పన్నకు వైభవంగా ఆర్జిత సేవలు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి ఆదివారం ఆర్జిత సేవలు విశేషంగా నిర్వహించారు. ఆలయ కల్యాణమండపంలోని వేదికపై స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి,భూదేవిలను అధిష్ఠింపజేసి 108 స్వర్ణసంపెంగ దళాలతో అష్టోత్తర శతనామావళి పూజ చేశారు. ఏఈవో ఆనంద్‌కుమార్ ఏర్పాట్లు పర్యవేక్షించారు. శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి నిత్యకల్యాణం వైభవంగా నిర్వహించారు.

పర్యావరణ పరిరక్షణతో కాలుష్య నివారణ



ప్రిన్సిపాల్ సుధీర్‌కుమార్ మాంగీ పర్యవేక్షణలో మొక్కలు నాటుతున్న విద్యార్థులు

సింథియా : పర్యావరణ పరిరక్షణలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని, తద్వారా అటవీ ప్రాంత విస్తరణ, కాలుష్యరహిత వాతావారణం పరిఢవిల్లుతాయని కేంద్రీయ విద్యాలయం–1 ప్రిన్సిపాల్ సుదీర్‌కుమార్ మాంగీ అన్నారు. ఆదివారం జాతీయ విద్యా విధానంలో భాగంగా ఎకో క్లబ్ ఫర్ మిషన్ లైఫ్ కార్యక్రమం నిర్వహించారు. ప్రధాని మోదీ పిలుపు మేరకు పాఠశాల ఆవరణలో ఏక్ పేడ్ మాకే నామ్ కార్యక్రమంలో భాగంగా విద్యార్థుల తల్లిదండ్రులతో మొక్కలు నాటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హిందూమతం సనాతన ధర్మం, పర్యావరణ పరిరక్షణకు అత్యంత ప్రాముఖ్యతను ఇస్తుందన్నారు. భవిష్యత్ తరాల కోసం కాలుష్య రహిత, సురక్షితమైన వాతావరణాన్ని అందించడమే లక్ష్యంగా ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి వాటిని సంరక్షించాలన్నారు. మాతృదేవోభవ అనే భావాన్ని పాటిస్తూ ప్రతి ఒక్కరూ తల్లి పేరు మీద ఒక మొక్క నాటాలని కోరారు. జీవశాస్త్ర ఉపాధ్యాయులు సీహెచ్‌ఎంఎస్ కుమార్, గురుప్రీత్‌షైని ఆధ్వర్యంలో విభిన్నమైన మొక్కలు నాటారు. కార్యక్రమంలో విద్యార్థులు, వారి తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

గుర్తు తెలియని వృద్ధురాలి మృతి



వృద్ధురాలి మృతదేహం

తాటిచెట్లపాలెం: రైలులో అపస్మారక స్థితిలో ఉన్న వృద్ధురాలు కేజీహెచ్‌లో చికిత్స పొందుతూ శనివారం రాత్రి మరణించినట్లు విశాఖపట్నం గవర్నమెంట్ రైల్వే పోలీసులు తెలిపారు. వివరాలిలా.. ఈ నెల 13న లోకమాన్య తిలక్ ఎక్స్‌ప్రెస్ విశాఖపట్నం చేరుకున్న అనంతరం రైలును నిర్వహణ పనుల నిమిత్తం న్యూ కోచింగ్ కాంప్లెక్స్‌కు తరలించారు. రైలు నిర్వహణ పనులు చేపడుతున్న సమయంలో జనరల్ కోచ్‌లో సుమారు 60 ఏళ్ల వృద్ధురాలు అపస్మారక స్థితిలో పడి ఉండటాన్ని క్లీనింగ్ సిబ్బంది, రైల్వే భద్రతా దళ సిబ్బంది గుర్తించి, వెంటనే చికిత్స నిమిత్తం కేజీహెచ్‌కు తరలించారు. అప్పటి నుంచి చికిత్స పొందుతున్న ఈ వృద్ధురాలు శనివారం రాత్రి మృతిచెందింది. ఈ మహిళకు సంబంధించి ఏ విధమైన ఆధారాలు లభ్యం కాలేదని, ఈమె సుమారు 5 అడుగుల ఎత్తు, పసుపు, నలుపు రంగులు గల నైటీ ధరించి, చామనచాయలో ఉందని జీఆర్పీ సిబ్బంది తెలపారు. ఈమె గురించి ఎవరికైనా తెలిస్తే విశాఖపట్నం రైల్వే స్టేషన్‌లోని రైల్వే పోలీసులకు గానీ, 96661 22722, 94406 27547 నంబర్లలో గానీ తెలియజేయాలని జీఆర్పీ ఎస్‌ఐ వి.బాలాజీరావు కోరారు.

వీధికుక్కల స్వైర విహారం

వరుస దాడులతో బెంబేలెత్తి పోతున్న ప్రజలు



వీధికుక్క కరవడంతో లక్ష్మి అనే మహిళ పాదంపై గాయాలు

సింథియా: ఇటీవల కాలంలో వీధి కుక్కల దాడులు అధికమవుతున్నాయి. 62వ వార్డు ప్రకాష్‌నగర్‌లో లక్ష్మి అనే మహిళపై వీధి కుక్కలు దాడి చేసి గాయపరిచాయి. ఈ ఘటనతో స్థానిక ప్రజలు బెంబేలెత్తిపోతున్నారు. లక్ష్మి పెంచుకుంటున్న పెంపుడు కుక్కపై వీధి కుక్కల గుంపు దాడి చేస్తుండడంతో అడ్డుకునేందుకు ప్రయత్నించింది. దీంతో తిరగబడిన వీధి కుక్కలు లక్ష్మిపై దాడి చేసి పాదాలను తీవ్రంగా గాయపరిచాయి. వెంటనే ఆమెను స్థానికంగా ఉన్న ప్రైవేట్ ఆస్పత్రికి తీసుకువెళ్లి ప్రథమ చికిత్స చేశారు. అనంతరం రేబిస్ వ్యాక్సిన్ కోసం ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకువెళ్లారు. సంబంధిత అధికారులు స్పందించి వీధి కుక్కల నియంత్రణకు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

సత్ప్రవర్తనతో మెలగండి

సీతమ్మధార: ఎటువంటి నేరాల జోలికి పోకుండా సత్ప్రవర్తనతో మెలగాలని రౌడీషీటర్లకు పోలీసులు సూచించారు. ఫోర్త్‌టౌన్ పోలీస్ స్టేషన్ ఆవరణలో ఆదివారం రౌడీషీటర్లకు సీఐ ఎస్.విజయకుమార్ కౌన్సెలింగ్ నిర్వహించి, వేలిముద్రలు సేకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తగాదాలు, కొట్లాటల్లో తలదూర్చకుండా కుటుంబాలతో కలిసి హాయిగా జీవించాలని సూచించారు. సమాజంలో ఎటువంటి నేరాలకు పాల్పడినా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. మీరు చేసే పనులపై పోలీస్ నిఘా ఎల్లప్పుడూ ఉంటుందని గుర్తుంచుకుని మంచిగా నడుచుకోవాలని రౌడీషీటర్లకు సీఐ హితవు పలికారు. కార్యక్రమంలో ప్రమీల, వెంకటరావు, పలువురు సిబ్బంది పాల్గొన్నారు.

- ద్వారకా జోన్ పోలీస్ స్టేషన్‌లో రౌడీషీటర్లకు ఎస్‌ఐ శ్రీను కౌన్సెలింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమాజంలో ఎటువంటి అల్లర్లు చేయకుండా ఉండాలని హెచ్చరించారు. తగాదాలు, కొట్లాటల్లో తలదూర్చకుండా కుటుంబాలతో కలిసి ఆనందంగా జీవించాలని సూచించారు. రౌడీషీటర్లపై దినచర్యపై ఆరా తీశారు.

‘శ్రీమద్రామాయణం’ వ్యాస సంపుటి ఆవిష్కరణ



గరికిపాటి నరసింహారావుకు పుస్తకాన్ని అందిస్తున్న ఆవిష్కర్త అప్పాజోస్యుల సత్యనారాయణ

సీతంపేట: వాల్మీకి రామాయణంలో రాముడు సాధారణ మానవుడని, విశ్వనాథ వారి రామాలయంలో రాముడు సాక్షాత్తు పరమేశ్వర స్వరూపుడని(విష్ణువు) ఆచార్య అప్పాజోస్యుల సత్యనారాయణ అన్నారు. విశాఖ రసజ్ఞ వేదిక ఆధ్వర్యంలో ఆదివారం ద్వారకానగర్ పౌర గ్రంథాలయంలో జరిగిన సభలో ‘శ్రీమద్రామాయణ కల్పవృక్షము, ఉదాత్త కల్పనలు’ వ్యాస సంపుటిని ముఖ్య అతిథిగా ఆయన ఆవిష్కరించి మాట్లాడారు. ఆచార్య బేతవోలు రామబ్రహ్మం సంపాదకులుగా, బాలకాండపై వ్యాసం రాయగా, ఐదుగురు గొప్ప సాహితీవేత్తలు అద్దంకి శ్రీనివాస్, పాలపర్తి శ్యామలానంద ప్రసాద్, బులుసు వెంకటేశ్వర్లు, కడిమిళ్ల వరప్రసాద్, పేరి రవి కుమార్ ఐదు కాండాలకు వ్యాసాలు రాయడం, అటువంటి గొప్ప వ్యాస సంపుటి ఆవిష్కరణకు అవకాశం కల్పించడం అంతా రాముని దయగా పేర్కొన్నారు. ఉదాత్త కల్పనల వల్లే రామాయణానికి గొప్ప మహత్తు వచ్చిందన్నారు. విశ్వనాథ వారి రచన ఊహకందదని, పాత్ర ప్రవేశం చాలా గొప్పగా వర్ణిస్తారన్నారు. తొలి ప్రతిని విశ్వనాథ మనుమడు విశ్వనాథ సత్యనారాయణకు అందజేశారు. సభకు విశిష్ట అతిథిగా విచ్చేసిన గరికిపాటి నరసింహారావుకు మరో ప్రతిని అందించారు. సభాధ్యక్షుడు డాక్టర్ జి.రఘురామారావు మాట్లాడుతూ రామాయణంపై విశాఖ రసజ్ఞ వేదిక ఆధ్వర్యంలో వరుసగా మూడు కార్యక్రమాలు నిర్వహించే అవకాశం రాముని వల్లే లభించిందన్నారు. వినూత్న రీతిలో వ్యాసకర్తలే సమీక్షించడం విశేషమని పేర్కొన్నారు. విశ్వనాథ సత్యనారాయణ మాట్లాడుతూ తాత గారు రాసిన మూల గ్రంథాలన్నీ అచ్చువేసి అందుబాటులోకి తీసుకొచ్చామన్నారు. విశ్వనాథ తండ్రి శోభనాద్రి ఆజ్ఞతో తాతగారు రామాయణం రాశారని తెలిపారు. చివరగా గరికిపాటి నరసింహారావు ప్రసంగించి సభికులను ఆకట్టుకున్నారు. కార్యక్రమంలో ప్రయాగ సుబ్రహ్మణ్యం, తురగా కృష్ణకుమార్, పలువురు రచయితలు, సాహితీవేత్తలు పాల్గొన్నారు.

బాలిక బలవన్మరణం

యల్లపువానిపాలెంలో ఘటన

గోపాలపట్నం : యల్లపువానిపాలెంలో బాలిక ఉరి వేసుకుని మృతి చెందిన ఘటన స్థానికంగా విషాదం నింపింది. ఆదివారం మధ్యాహ్నం ఇంట్లో ఎవరూ లేని సమయంలో పడక గదిలో హుక్కుకు ఉరి వేసుకుని మృతి చెందింది. బాలిక యల్లపువానిపాలెం జిల్లా పరిషత్ హైస్కూల్లో పదో తరగతి చదువుతోంది. తల్లి వరలక్ష్మి ఎస్‌ఏడీలోని ఒక హోటల్లో పని చేస్తోంది. మధ్యాహ్నం వరకు అక్క, బావ ఇంట్లో ఉన్నారు. వారు బయటికి వెళ్లిన తర్వాత బాలిక ఉరి వేసుకుంది. వీరు మూడు గంటల సమయంలో ఇంటికి వచ్చే సరికి బెడ్ రూములో ఉరి వేసుకుని ఉండడం గమనించారు. దాంతో తలుపులు పగులగొట్టి బాలికను దించారు. అప్పటికే బాలిక మరణించినట్లు కుటుంబ సభ్యులు నిర్ధారించారు. బాలికకు కడుపునొప్పి ఉందని, దీని వల్లే మృతి చెంది ఉంటుందని కుటుంబ సభ్యులు చెబుతున్నారు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలికి చేరుకుని వివరాలు సేకరించారు. మృతదేహాన్ని కేజీహెచ్‌కు తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

అలరించిన స్టోరీ టెల్లింగ్



పిల్లలకు కథ చెబుతున్న సీతా శ్రీనివాస్

సీతంపేట: ద్వారకానగర్ పౌర గ్రంథాలయంలో ఆదివారం నిర్వహించిన మియావాకీ స్టోరీ టెల్లింగ్ పిల్లలను అలరించింది. కథకురాలు సీతా శ్రీనివాస్ తనదైన శైలిలో కథలు చెప్పి యువ మనసుల్లో ఊహ, సృజనాత్మకత వెలిగించారు. జూ డక్, టైన్ అండ్ ది ఫార్ అవే మౌంటైన్ కథలను చెప్పే విధానం ఆసక్తికరంగా సాగింది. పిల్లలు కథలు వినడంతోపాటు కథలకు సంబంధించిన ఆటపాటల్లో నిమగ్నమయ్యారు. ముద్రించిన సాహిత్యాన్ని, వారి కలలను చిన్న చిన్న వర్క్ షీట్లపై పొందుపర్చారు. యాక్టివిటీలో భాగంగా పాటలు పాడటం, హ్యాండ్ ఆన్ యాక్టివిటీలు, బెలూన్ బ్లోయింగ్‌లో పిల్లలు చురుగ్గా పాల్గొన్నారు. కార్యక్రమంలో వివిధ పాఠశాలలకు చెందిన 60 మంది చిన్నారులు పాల్గొన్నారు.

ఘనంగా గ్రామదేవతల పండగలు



మరిడిమాంబ అమ్మవారికి ఊరేగింపుగా సారె తీసుకెళ్తున్న మహిళలు

మల్కాపురం: జీవీఎంసీ 61వ వార్డు వెంకన్నపాలేనికి చెందిన శ్రీవాసుదేవ అన్నమయ్య పద నామావళి కోలాట మహిళ సంఘం వారు ఆదివారం మల్కాపురం గ్రామదేవత మరిడిమాంబ అమ్మవారి పండగను ఘనంగా నిర్వహించారు. సంఘ నిర్వాహకురాలు నీలాతి గుణవతియాదవ్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో పారిశ్రామిక ప్రాంతం నలుమూలల నుంచి సుమారు 200 మంది మహిళలు పాల్గొని వెంకన్నపాలెం శ్రీకృష్ణుని ఆలయం నుంచి మరిడిమాంబ ఆలయం వరకు భారీ ఊరేగింపుగా మేళతాళాల నడుమ తరలి వెళ్లారు. ఈ సందర్భంగా ప్రతి మహిళ వివిధ పండి వంటలు, పలు రకాల పండ్లను అమ్మవారికి సారె రూపంలో సమర్పించారు. ముందుగా కృష్ణాలయంలో మహిళలంతా పూజలు చేసి కోలాటమాడారు. అనంతరం మరిడిమాంబ ఆలయం వరకు వెళ్లి అమ్మవారికి పూజలు జరిపి, కోలాట ప్రదర్శన చేశారు.

కుంచిమాంబకు విశేష పూజలు

58వ వార్డు కుంచిమాంబ కాలనీలో కుంచిమాంబ అమ్మవారి పండగ ఘనంగా నిర్వహించారు. శ్రీదేవి చారిటబుల్ ట్రస్టు నిర్వహికుడు, టీడీపీ వార్డు అధ్యక్షుడు కోరాడ శ్రీను ఆధ్వర్యంలో జరిగిన పూజా కార్యక్రమాల్లో గ్రామస్తులతోపాటు పలువురు టీడీపీ నాయకులు పాల్గొని అమ్మవారిని దర్శించుకున్నారు.

పచ్చని పరిసరాలతో ఆహ్లాదం



మొక్కలు నాటుతున్న విద్యార్థులు, ఉపాధ్యాయులు

కంచరపాలెం: పరిసరాలు పచ్చగా ఉంటే ఆరోగ్యకర వాతావరణం నెలకొంటుందని కేవీ-2 విద్యాలయ ప్రిన్సిపాల్ సీహెచ్ శ్రీనివాసులు తెలిపారు. కంచరపాలెం ఇండస్ట్రియల్ ఎస్టేట్ విజయనగర్‌కాలనీలోని కేంద్రీయ విద్యాలయం -2 లో శిక్షా సప్తాహ్’ లో భాగంగా ఆదివారం పాఠశాల ఆవరణలో విద్యార్థుల చేత మొక్కలు నాటించారు. శ్రీనివాసులు మాట్లాడుతూ మాతృమూర్తికి గౌరవం ఇస్తూ మొక్కలు నాటే కార్యక్రమం చేపట్టడం జరిగిందన్నారు. పాఠశాలలో ప్రతిఒక్క విద్యార్థి మొక్క నాటడంతో పాఠశాల పచ్చదనంతో కనిపిస్తుందన్నారు. ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

నేవల్ పార్కు ఏరియాలో పాముల హల్‌చల్



నేవల్ పార్కు ఏరియాలో పట్టుకున్న పాము

సింథియా: నేవల్ పార్కు ఏరియాలో తరచూ పాములు సంచరిస్తూ నివాసులను హడలెత్తిస్తున్నాయి. తాజాగా ఆదివారం ఉదయం నేవల్ పార్కు ఏరియా ప్రధాన ద్వారం వద్ద నాగుపాము హల్‌చల్ చేసింది. ఆందోళన చెందిన నేవల్ సిబ్బంది వెంటనే పాములు పట్టే నేర్పరి నాగరాజుకు ఫోన్ ద్వారా సమాచారం అందించారు. వెంటనే అక్కడికి చేరుకున్న ఆయన పామును ఎంతో చాకచక్యంగా పట్టుకుని నిర్మానుష్య ప్రదేశంలో విడిచిపెట్టారు. విషసర్పం కావడంతో ఆందోళన చెందిన సిబ్బంది.. ఎవ్వరికీ ఎటువంటి ప్రమాదం జరగకపోవడంతో ఊపిరి పీల్చుకున్నారు. తరచూ పాములు జన సంచారంలోకి రావడంతో స్థానికులు భయాందోళనలు వ్యక్తం చేస్తున్నారు. పాములను నియంత్రించేలా చర్యలు తీసుకోవాలని అధికారులను కోరుతున్నారు.

అలరించిన నృత్యప్రదర్శన



నృత్యప్రదర్శన చేసిన విద్యార్థులతో సత్యదేవ్ తదితరులు

సింహాచలం: భారతీయ సాంప్రదాయంలో మానవతా విలువలు, వేద విజ్ఞానం, సాహిత్యనృత్య, సంగీత కళల పరిరక్షణ ప్రధానమని జగద్గురు పీఠం డైరెక్టర్ చింతలపాటి సత్యదేవ్ అన్నారు. సింహగిరిపై రాజగోపురం పక్కన ఉన్న కళావేదికపై విజయవాడకు చెందిన మువ్వగోపాల కల్చరల్ ఆర్ట్స్ అకాడమీకి చెందిన 150 మంది నృత్య కళాకారులతో ఆదివారం ప్రత్యేక నృత్యప్రదర్శన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో పాల్గొన్న సత్యదేవ్ మాట్లాడుతూ దైవానుగ్రహం, పురుష ప్రయత్నం మానవజీవితంలో ముఖ్యమైనవని తెలిపారు. దైవారాధన, పరహిత జీవన విధానం సమాజ హితానికి దోహదపడతాయని చెప్పారు. ఈ సందర్భంగా ప్రత్యేక నృత్యప్రదర్శన ఏర్పాటు చేసిన కల్చరల్ ఆర్ట్స్ నిర్వాహకులు నందిరాజు కృష్ణను అభినందించారు. తిరుపతి, చిత్తూరు, రాజమండ్రి, ఉత్తరాంధ్ర తదితర ప్రాంతాలకు చెందిన 150 మంది నృత్యప్రదర్శనతో అలరించారు. ప్రదర్శనలో పాల్గొన్న వారి సత్యదేవ్ సర్టిఫికెట్లు, జ్ఞాపికలు, వరాహ లక్ష్మీనృసింహస్వామి చిత్రపటాలు అందజేశారు.

టోల్‌గేటును శాశ్వతంగా ఎత్తివేయాలి



అగనంపూడి టోల్‌ప్లాజా వద్ద ఆందోళన చేపడుతున్న సీపీఎం నాయకులు

అగనంపూడి: అగనంపూడి టోల్‌గేటును శాశ్వతంగా ఎత్తివేయాలని, ఇప్పటికే పిలిచిన టెండర్లను రద్దు చేయాలని 78వ వార్డు కార్పొరేటర్ బి.గంగారామ్ డిమాండ్ చేశారు. సీపీఎం స్టీల్‌సిటీ జోన్ కమిటీ ఆధ్వర్యంలో అగనంపూడి టోల్‌ప్లాజా వద్ద నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏడాది కాలపరిమితితో పిలిచిన టెండర్లను వెంటనే ఉపసంహరించుకోవాలన్నారు. తెలుగుదేశం, కూటమి నాయకులు నెలరోజుల క్రితం టోల్‌గేటును ధ్వంసం చేసి ఎత్తివేశారని ప్రచారం చేసుకుంటున్నారని, అయితే వాస్తవంగా పద్ధతి ప్రకారం టెండర్లను నిలుపుదల చేసేలా కూటమి నాయకులు ప్రయత్నం చేయాలని కోరారు. తొలగించిన కొద్దిరోజులకే భోగాపురం ఎయిర్‌పోర్టు ప్రాంతాన్ని సందర్శించిన ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఎన్‌హెచ్‌ఏఐ అధికారులకు అగనంపూడి టోల్‌గేటును కొనసాగించాలని ఆదేశించినట్టు తెలిసిందని, అదే వాస్తవమైతే టీడీపీ ద్వంద్వనీతి బయటపడుతుందని ఆరోపించారు. కార్యక్రమంలో స్టీల్‌జోన్ కమిటీ నాయకులు పెదిరెడ్ల నీలకంఠం, ఉరివిటి మరిడయ్య, శ్రీనివాసరాజు తదితరులు మాట్లాడారు.

ఉక్కు దీక్షకు సంఘీభావం

సీతమ్మధార: స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా జీవీఎంసీ గాంధీ విగ్రహం వద్ద జరుగుతున్న దీక్షకు ఆదివారం డిఫెన్స్ కో–ఆర్డినేషన్ కమిటీ ఆధ్వర్యంలో సివిలియన్ ఎంప్లాయిస్ యూనియన్ నాయకులు సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా నాయకుడు బానోజీ బిల్లా మాట్లాడుతూ ఎంతో మంది త్యాగాల ఫలితంగా స్టీల్‌ప్లాంట్ వచ్చిందన్నారు. దేశ ఆర్థిక వ్యవస్థకు వెన్నుదన్నుగా ఉన్న ప్రభుత్వ రంగ సంస్థలను కేంద్ర ప్రభుత్వం కార్పొరేట్ సంస్థలకు కారు చౌకగా అమ్మడాన్ని ప్రజలందరూ వ్యతిరేకించాల్సిన అవసరం ఉందన్నారు. స్టీల్‌ప్లాంట్ దగ్గరికి వస్తే తరిమికొడతామని, ప్లాంట్‌కు ఎవరు వచ్చినా అడ్డుకుంటామని అన్నారు. ఉక్కు పరిశ్రమను లాభాల బాటలోకి తీసుకురావడానికి కార్మికులు కష్టపడి పని చేస్తుంటే ప్రభుత్వం, యాజమాన్యం కలిసి బొగ్గు కొరత సృష్టించారన్నారు. ఉత్పత్తికి ఆటంకం కలిగించడం దురదృష్టకరమన్నారు. ఈ కార్యక్రమంలో కో–ఆపరేటివ్ డైరెక్టర్ మీసాల సురేష్, షాప్ కమిటీ మెంబర్ వినీష్, సూరప్పుడు, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.